# కథ

తరిమెల అమరనాథరెడ్డి

# సునామీ

**"సార్! యిది స్టూడెంట్ ఫెడరేషనోల్ల కరపత్రం. అర్జెంటంట. బిరీన ప్రూఫ్ చూస్తే ప్రింట్ చేసేస్తాం" అంటూ ప్రూఫ్‌తో పాటు ఒరిజినల్ నా టేబుల్‌పై పెట్టాడు మా ప్రెస్ వర్కర్ నారాయణ.**

**కరపత్రం చిన్నదే అయినా తప్పులు ఎక్కువ కనపడ్డం వల్ల ప్రూఫ్ చూడ్డానికి విసుగొచ్చింది.**

వెంటనే పక్కనే వున్న కంప్యూటర్ రూమ్‌లోకి వెళ్ళి "ఈ కరపత్రం టైప్ చేసింది ఎవరు?" అన్నాను కోపంగా.

ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తుండే నేను అనుకోకుండా కోపంగా మాట్లాడేటప్పటికి- "నేనే సార్" అంటూ భయంగా లేచి నిలబడ్డాడు గత ఆరు నెలల కిందటే మా ప్రెస్‌లో చిరుద్యోగంలో చేరిన విద్యాసాగర్.

పక్కనే వున్న ఆపరేటర్లు శేషుబాల, సాంబయ్య, బ్రహ్మయ్యలు 'మేము కాదన్నట్లు' నావైపు చూసి తమ పనిలో నిమగ్నమయ్యారు.

నేనేమంటానో అని బెదురుబెదురుగా నావైపే చూస్తూ నిలబడ్డ సాగర్‌వైపు చూసి "కూచో బ్రదర్! చూడు ఎన్ని తప్పులున్నాయో" అంటూ ప్రూఫ్ అతని చేతికిచ్చా.

బిక్కమొగంతో ఆ కాగితంవైపే చూస్తూ కూచున్నాడు సాగర్.

"బ్రదర్! ఈ ఆరు నెలలుగా టైపింగ్ ప్రాక్టీస్ చేస్తున్నావు. మొదటిసారిగా ఈ చిన్న కరపత్రం చేసావు. అంతా తప్పులే. అసలు నువ్వు ఎం.ఏ., ఇంగ్లీష్ మీడియంలో చేశావా? తెలుగు మీడియంలో చేశావా?" అని అడిగా.

"తెలుగు మీడియం సార్" అన్నాడు వినయంగా.

"అరె! తెలుగు మీడియం అంటావు. తెలుగు కరపత్రమే సరిగా చేయలేదంటే నీకు టైప్ చేయడం సరిగా రాదా? లేక తెలుగు అక్షరాలే సరిగా రావా? తెలుసుకోవాలనిపిస్తోంది" అన్నాను.

ఏం మాట్లాడలేక మౌనంగా నావైపే చూస్తున్నాడు సాగర్.

పక్కనే వున్న ముగ్గురూ నిశ్శబ్దంగా నవ్వుతూ టైప్ చేస్తున్నారు.

"సరే బ్రదర్! పేపరు, పెన్ను తీసుకో. ఈ కరపత్రం డిక్టేట్ చేస్తాను. ఎట్లా వ్రాస్తావో చూద్దాం" అంటూ నా కుర్చీని అతనికి దగ్గరగా లాక్కొని కూచున్నాను.

పేపరు, పెన్నుతో సిద్ధమైన సాగర్ "చెప్పండి" అన్నట్లు నా వైపు చూశాడు.

"స్కాలర్‌షిప్పులు స్వాహా చేసిన ప్రిన్సిపాల్ పిచ్చయ్య" అంటూ కరపత్రం హెడ్డింగ్ గట్టిగా డిక్టేట్ చేస్తూ సాగర్ వైపు చూసాను ఆసక్తిగా.

'సకలరసిప్పులు సవహా చేసిన ప్రినిసిపాల్ పీచయ్య' అని సాగర్ వ్రాసిన హెడ్డింగ్ చూస్తూనే నా హెడ్ బ్రేక్ అయినట్లయింది.

విపరీతమైన నవ్వొచ్చినా నాలోనే అణుచుకున్నాను.

ఎం.ఎ. చేసిన సాగర్‌కు తెలుగు అక్షరాలు వ్రాయడం కూడా రాదని అర్థమయింది.

దూరంగా జరిగాను.

కేవలం కరపత్రంలో రెండు వాక్యాలు మాత్రమే డిక్టేట్ చేసిన తర్వాత "బ్రదర్! ఏం వ్రాసినావో చదువు" అన్నాను.

వ్రాసింది తప్పులే కనుక చదివిందీ తప్పులే.

ప్రక్కన వున్న శేషుబాల, సాంబయ్య, బ్రహ్మయ్యలు నావైపు చూస్తూ మౌనంగా నవ్వుతున్నారు.

వారి కళ్లల్లో విద్యాసాగర్ పట్ల సానుభూతి వ్యక్తమౌతూంది.

నావైపు చూడ్డానికి యిబ్బంది పడుతున్నట్లు తలవంచుకునే కూచున్న విద్యాసాగర్ భుజంపై చేయి వేసి,

"చూడు బ్రదర్! నిన్ను చూస్తే కోపం రావడం లేదు కానీ జాలేస్తూంది. ఎందుకంటే తప్పు నీది కాదు. రోజు రోజుకు పాడైపోతున్న విద్యా వ్యవస్థది" సానుభూతిగా అంటూ,

"బ్రదర్ నిన్ను చూస్తుంటే... 'కాను' పాసులు, కాసుల పాసులు, కాపీల పాసులు, క్యాస్ట్‌ల పాసులతో వచ్చే డిగ్రీలు వేస్ట్. ఇటువంటి అక్రమ మార్గాలతో విద్యా వ్యాపారం చేస్తూ లక్షలు గడిస్తున్న విద్యాసంస్థలూ, వీరికి జాతీయ అవార్డులు యిస్తున్న సంస్థలూ, యిక కాపీలు కొట్టించి మంచి రిజల్ట్ తెచ్చిన హెడ్ మాస్టర్లకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులిచ్చే ప్రభుత్వం. ఇలా క్షణక్షణం దిగజారిపోతున్న విద్యారంగాన్ని చూస్తుంటే చదువుల తల్లికి ఎయిడ్స్ వచ్చిందేమోననిపిస్తుంది అమర్ అంటూ సాహిత్య ధోరణిలో యిటీవలే నాతో వాపోయిన మా సింగమనేని సార్ మాటలు గుర్తొస్తున్నాయి బ్రదర్" అంటూ ఉపన్యాస ధోరణిలో మాట్లాడాను.

ఇలా ఏ రంగాన్ని గురించి ఆలోచించినా పిచ్చెక్కుతుంది. అయినా ఎందుకో ఆలోచించకుండా ఉండలేం అనుకొని.

"చూడు సాగర్! విద్యారంగంలో విలువలు పాడైపోయినాయి. కనుకనే పొట్ట చింపితే అక్షరం ముక్క రాకపోయినా పట్టాలు తీసుకొని ప్రతి ఏటా ఎందరో వీధుల్లో పడుతున్నారు. వారిలో నీవు ఒక్కనివీ అనుకోకుండా మా ప్రెస్‌లోకి పడడం వల్ల మాకు తటస్థపడినావు" అన్నాను ఆవేదన, ఆవేశం కలగలిపిన స్వరంతో.

నావైపే మౌనంగా చూస్తున్న సాగర్‌ను కాస్సేపు నేనూ మౌనంగా, జాలిగా చూస్తూ ఉండిపోయాను.

"సరే! ఈ కరపత్రం త్వరగా చేసెసెయ్యి" అంటూ పక్కనే వున్న సాంబయ్యకు యిచ్చి వచ్చేశాను ఆఫీసు రూమ్‌లోవున్న నా సీటులోకి.

మధ్యాహ్నం యింట్లో భోంచేస్తూ సాగర్ విషయం నా భార్య శాంతకు చెప్పాను.

నవ్వుతూ- "అంతేనండీ..యిప్పుడు చదువులే అట్లున్నాయి. పిల్లోల్లు అట్లే ఉన్నారు" అంటూ-

"మొన్ననే మన రవిని ఏంరా! రేపు పరీక్షలు పెట్టుకొని చదువుకోకుండా టీ.వీ. చూసుకుంటూ కుచ్చున్నావే?" అని అడిగితే

"చదువుకుండేది లేదక్కా-చించుకుండేదే" అన్నాడు వాడు నెమ్మదిగా.

మరునటి రోజు పరీక్ష వ్రాసి వచ్చిన తర్వాత-

"ఏంరా? బాగా వ్రాసినావా?" అని అడిగితే

"మెడ కూడా తిప్పనీలేదక్కా" అన్నాడు నవ్వుతూ.

"అంటే ఏందో నాకర్థం కాలేదన్నా"

"వీడు చించుకొని పోయినవి రాలేదంట. పక్కనేని దాంట్లో చూసైనా కాపీ కొడదామనుకుంటే ఎవరో అయ్యవారు స్ట్రిక్ట్‌గా వున్నాడంట. కాబట్టి మెడ కూడా తిప్పనీలేదంట" అని చెప్పింది మా పెంపుడు కొడుకులాంటి రవిని గురించి నవ్వుతూ.

ఈ మాటలు విన్న నాకూ నవ్వు ఆగలేదు.

"అంతేనండీ! సమాజం రోజు రోజుకూ పాడైపోతాంది. మీరేమో సంసారం పట్టించుకోకుండా సమాజం బాగా చెయాలని గంటలు గంటలు ఫోన్లల్లో మాట్లాడుతుంటా వుంటారు. ఫోన్ బిల్లులు కట్టడానికి ఇబ్బంది పడతాంటారు. దీనివల్ల సమాజం బాగుపడదు కాని మన సంసారం చెడిపోతాంది. యిప్పటి నుంచైనా సమాజం అనుకోకుండా ప్రెస్ సరిగా చూసుకోండి" అని హితబోధ చేసింది నవ్వుతూ.

ఏం చెప్పాలో తెలీక నవ్వుతూ ప్రెస్‌కు బయలుదేరాను.

మధ్యాహ్నం భోజనం విరామంలో యింటికి వెళ్ళిన సాగర్ తిరిగి ప్రెస్‌కు రాలేదని గమనించిన నేను విషయం కనుక్కుందామని "విద్యాసాగర్ రాలేదా?" అని అడిగాను.




"సార్! యింక రానని చెప్పి వెళ్ళిపోయినాడు సార్" అన్నారు ముగ్గురూ ఏకకంఠంతో.

"అబ్బా! మంచిపని చేసినాడు. నాకు ఆ మాట చెప్పే శ్రమ తగ్గించినందుకు ఆ అబ్బాయికి పరోక్షంగానైనా థ్యాంక్స్ చెప్పుకోవాల్సిందే" అన్నాను నవ్వుతూ.

"సార్! ఆ అబ్బాయికి ఏమీ రాదని మాకు ఎప్పుడో తెలుసు సార్. కానీ చెప్తే పాపం మీరు తీసేస్తారేమో, అతని ఉసురు మాకు కొట్టుకుంటుందేమోనని మీతో చెప్పలేదు సార్" అన్నాడు సానుభూతి వ్యక్తపరుస్తూ సాంబయ్య.

"ఎట్లా తెలుసుకున్నారు?" అని అడిగాను ఆసక్తిగా.

"ఒకసారి విద్యాసాగర్ నీ పేరు డిక్షనరీలో ఎక్కడుందో చూపిస్తావా అంటూ ఇంగ్లీష్ డిక్షనరీ యిచ్చినాం సార్" అని నవ్వాడు.

"పేరు డిక్షనరీలో వుండదు కదా?" అన్నాను.

"ఉండదని మాకు తెలుసు సార్. కానీ జస్ట్ ఆ అబ్బాయిని టెస్ట్ చేద్దామనే" అన్నాడు సాంబయ్య.

"మరి విద్యాసాగర్ ఏం చేశాడు అప్పుడు"

"డిక్షనరీ తీసుకొని దాదాపు గంటసేపు అయినా వెతుకుతూనే వున్నాడు. చివరకు మాకే విసుగొచ్చి ఏం సాగర్? దొరకలేదా? అని అడిగాం. లేదన్నా! అంటూ బిక్కమొగం వేసినాడు."

యిదంతా వింటూనే "అబ్బా! ఎంత ఘోరం" అనిపించింది నాకు.

"పాపం తెలుగు మీడియం కనుక నాకు ఇంగ్లీషు డిక్షనరీ చూడ్డం రాదని ఫ్రాంక్‌గా చెప్పుండవచ్చు కదా. కానీ అలా చెప్తే నవ్వుతారేమోనని నామోషితో చెప్పలేక చివరకు అమాయకంగా గంటసేపు వెతికి తన అజ్ఞానాన్ని చాటుకొని నవ్వుల పాలయ్యాడు" అన్నాను సానుభూతితో.

"అయినా యిట్లాగాడు ఎం.ఏ. ఎట్లా పాసయినాడో?" అని అడిగా.

"మేమూ అదేమాట అడిగినాం సార్"

"ఏముంది కాసుపాసుతో కొన్ని క్లాసులు పాసయినా, డబ్బులిచ్చి ఏడు, పది క్లాసులు పాసయినా, కాపీలు కొట్టి ఇంటర్, డిగ్రీ పాసయినా, అయ్యవార్లను కొట్టి పి.జి. పాసయినా" అన్నాడు గర్వంగా.

అరె అయవారిని కొట్టి పి.జి. పాసయ్యేదేందనుకొని "ఎం.ఏలో ఒక్కొక్క ప్రశ్నకు పేజీలు పేజీలు ఆన్సర్ వ్రాయాలికదా కాపీ కొట్టడానికి టైం చాలదే" అని అడిగాం అమాయకంగా.

అందుకేన్నా "అయవారిని కొట్టేది" అన్నాడు.

"నువ్వు చెప్పేది మాకర్థం కాలేదన్నాం"

"ఆన్సర్లు రాసేదేందన్నా, క్వశ్చన్‌పేపరు వున్నదున్నట్లు రామకోటి రాసినట్లు రాసేదే. పేజీలు ఎక్కువ కావాలని అడిషనల్ పేపర్లు కూడా నింపేదే" అన్నాడు నవ్వుతూ.

"అరె! దానికెట్లా మార్కులు వేస్తారు?" అంటే

"ప్రొఫెసర్‌ది మా కులమే అయితే మంచి మార్కులే వేస్తాడు. వేరే కులమైతే వెయ్యడు. వెయ్యలేదు కాబట్టే కొట్టినా. అప్పుడు మా కులం స్టూడెంట్లంతా నాకు సపోర్టు చేసినారు. పాస్ చెయ్యకపోతే సమ్మె చేస్తాం అని బెదిరించినాం. కడాకు వి.సి. చెప్పడం వల్ల ప్రొఫెసర్ తప్పనిసరై ఫస్ట్‌క్లాసు మార్కులు వేసి పాస్ చేసినాడు అని చెప్పాడు ఏమాత్రం సిగ్గుపడకుండా హీరోలా ఫోజు కొడ్తూ" అన్నారు.

యిదంతా వింటుంటే గతంలో మా సింగమనేని సార్ చెప్పిన మాటలు అక్షర సత్యాలనిపించింది.

ఒకవైపు నేటి యువకుల పోరాట పటిమకు సంతోషపడినా మరోవైపు దారి తప్పుతున్నందుకు బాధపడినాను.

వీరికే సరైన క్రమశిక్షణ, ఆదర్శాలు, మార్గం వుంటే మన దేశభవిష్యత్తు ఆశాజనకంగానే వుంటుంది కదా అనిపించింది.

ఈమధ్యనే మా ఫ్రెండ్ కనపడితే అతని కొడుకు టెన్త్‌క్లాస్ పరీక్షలు వ్రాస్తాండాడని తెలిసి "బాగ వ్రాస్తాండాడా?" అని అడిగితే "నిన్నటివరకు బాగనే కొట్టినాడంట. యింక రేపొక్కరోజు అయవారు కండ్లు మూసుకుంటే బయటపడినట్లే అన్నాడు" మా ఫ్రెండ్ కాపీ కొట్టడం ఏ మాత్రం తప్పుకాదన్నట్లు ఫీలవుతూ.

నా మాటలకు నవ్వి "మీకందరూ యిట్లావాళ్ళే తగులుతాంటారు సార్" అన్నాడు సాంబయ్య.

"యిటీవలనే మా మిత్రుడు లెక్చరర్ చంద్రశేఖర్ చెప్పిన మాటలు వింటే ఏమంటారో?" అన్నా

"ఏమి చెప్పినాడు సార్"

"ఈమధ్యనే పరీక్షల్లో ఒక అమ్మాయి కాపీ కొట్తాంటే డీబార్ చేసినాడంట. దానికి ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించిందంట. చివరకు డి.ఇ.ఓ. జోక్యం చేసుకొని డీబార్ ఆర్డర్స్ క్యాన్సల్ చేసినాడంట."

"అంతేకదా సార్ అబ్బాయి అయింటే లెక్చరర్‌ను హత్య చేసిండేవాడు కదా. అమ్మాయి కాబట్టే ఆత్మహత్య చేసుకుంటాననింది. ఎంత ఘోరం సార్" అంటూ నవ్వింది శేషుబాల.

"విద్యార్థులు యిట్లా వున్నారు కాబట్టే మేము ఇన్విజిలేషన్ పోయినా ఎన్నికల్లో రిగ్గింగులు చేసుకుంటుంటే మౌనంగా చూస్తున్నట్లే పిల్లోల్లు కాపీలు కొట్టుకుంటున్నా కండ్లు మూసుకొని వుండాల్సిందే. కాబట్టే ఆ డ్యూటీకే యిక పోదల్చుకోలేదన్నాడు మా ఫ్రెండ్"

కాస్సేపు నవ్వుకున్నాం.

యిలా మేధావులను తయారు చేయాల్సిన విద్యారంగం పాడైపోతే సమాజమూ పాడైపోయినట్లే కదా అనుకొని బాధపడ్డాం కోరస్‌గా.

ఎవరి పనిలో వారు నిమగ్నమయ్యాం.

సాయంత్రం కరపత్రం తీసుకుపోవడానికి వచ్చిన స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులతో "విద్యారంగంలో విలువలు కాపాడ్డానికి ఉద్యమించండి. దేశభవిష్యత్తును కాపాడండి బ్రదర్స్" అన్నాను ఆవేదనగా.

"భవిష్యత్తులో తప్పకుండా దానికి తగిన కార్యక్రమాలు చేపట్తాం సార్!" అని గంభీరంగా అంటూ, "కరపత్రం డబ్బులు మరీ యిస్తామని" యిబ్బందిగా తలగీరుకుంటూ తీసుకుపోయారు కరపత్రాలు.

* * *

కొన్ని నెలలు గడిచిన తర్వాత ఎందుకో విద్యాసాగర్‌ను గురించి తెలుసుకోవాలనిపించింది.

"మీకు విద్యాసాగర్ కనపడ్డాడా? ఏం చేస్తున్నాడో?" అని అడిగాను.

"సార్ ఈ మధ్యనే నా కొడుకును మా యింటికి దగ్గరలో వున్న మాడల్ ఇంగ్లీషు మీడియమ్ స్కూల్లో ఎల్.కె.జి. చేరిపిల్లని పొయ్యింటే అప్పుడు ఆ స్కూలు దగ్గర కనపడినాడు సార్" అన్నాడు బ్రహ్మయ్య.

"నన్ను చూస్తానే వులిక్కిపడి పక్కకు తప్పుకుండేకి చూసినాడు సార్"

"అది చూసి నేను అరె! విద్యాసాగర్ ఏమబ్బా పలకరీకుండా పోతాండావు. ఏం చేస్తాండావు" అని అడిగితే-

"అన్నా! యిదే స్కూల్లో టీచర్‌గా చేరినానన్నా" అన్నాడు నంగినంగిగా.

ఆ మాట వింటూనే "ఏందీ స్కూల్లో టీచర్‌గానా?" అదేమి మాడల్ స్కూలా లేక మా 'డల్లు' స్కూలా?" అని అడిగా నేను ఆశ్చర్యపోతూ.

"నాకు కూడా ఆ మాట వింటూనే అట్లే అనిపించింది సార్. ఇట్లా విద్యాసాగర్ లాంటివాళ్ళు మనకు తెలీనోళ్ళు యింకెంత మందున్నారో ఈ స్కూల్లో టీచర్లుగా. ఇట్లా స్కూల్లో చేరేకి రెండు వేలు డొనేషన్ కట్టల్లంట సార్. ఎంత దోపిడీ సార్. ఘోరం సార్" అన్నాడు ఆక్రోశంగా బ్రహ్మయ్య.



## అదుపు

**మన శరీరం మన అదుపులో ఉంటే సక్సెస్ మన దరి చేరుతుంది. ఇది నిజమే అంటోంది నేహా దుఫియా. 'ఇప్పుడు బాలీవుడ్‌లో అందం గురించే చర్చ జరుగుతోంది. అందాన్ని సంరక్షించుకునేవారే అవకాశాల్ని చేజిక్కించుకుంటున్నారు. ఆరోగ్యంగా జీవించాలంటే కొన్ని నియమాలు తప్పనిసరి. షూటింగ్స్ ఉన్నప్పుడు ఎలాంటి నియమాలు పాటిస్తామో, లేనప్పుడు కూడా అలాంటివి పాటించాల్సిందే' అని చెబుతోంది నేహా.**

"యింతకూ బ్రహ్మయ్యా! నీ కొడుకును ఆ స్కూల్లో చేర్పించినావా? లేదా?" అని అడిగా.

"అబ్బా! యింకెట్ల చేర్పిస్తాను సార్. వెంటనే వెనక్కి తీసుకొని వచ్చినాను సార్" అన్నాడు, ఏదో షాక్ కొట్టినట్లు.

"మంచి పని చేసినావు. నీ కొడుకు భవిష్యత్ కాపాడుకున్నావు బ్రహ్మయ్యా" అన్నా.

"నా కొడుకు భవిష్యత్ సరే సార్! మీ ఫ్రెండ్ అన్నట్లు చదువుల తల్లి సరస్వతికి ఎయిడ్స్ వచ్చినట్లే సార్. ఇంక దేశ భవిష్యత్తు సున్నానే కదా సార్" అన్నాడు కాలజ్ఞానం తెలిసిన బ్రహ్మంగారిలా మా కంప్యూటర్ ఆపరేటర్ బ్రహ్మయ్య.